సాక్షి సూర్యాపేట

గురువారం, 7, సెప్టెంబర్, 2023



విద్యార్థినుల మృతితో ..

నల్లగొండలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వారి గ్రామాల్లో విషాదాన్ని నింపింది. - 8లో



ఒకేరోజు భార్యాభర్త మృతి

తొండ గ్రామానికి చెందిన లక్ష్మీనర్సయ్య, ఆయన భార్య సరోజనమ్మ మంగళవారం రాత్రి మృతిచెందారు. - 8లో



బైక్‌ను ఢీకొట్టిన లారీ..

బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కవిత మృతిచెందారు. - 8లో

న్యూస్‌రీల్

విదేశాలకు తపాలా పార్సిల్ సేవలు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట ప్రధాన తపాలా కార్యాలయంలో విదేశాలకు పార్సిల్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.సైదిరెడ్డి తెలిపారు. తపాలా సిబ్బంది ఆధ్వర్యంలో వినియోగదారులకు విదేశాలకు పంపే పార్సిల్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో వినియోగదారులు విదేశాల్లో ఉండే తమ బంధువులకు, ఇతర అవసరాలకు పార్సిల్ పంపుకునే వెసులుబాటును తపాలాశాఖ ఈ నెల 1 నుంచి అమలు చేసిందన్నారు. వినియోగదారులు తమ జీఎస్టీ నంబర్ పాన్ కార్డుతో ఎగుమతి, దిగుమతి కోడ్ రిజిస్ట్రేషన్ చేయించుకుని కరెంటు బ్యాంకు ఖాతా అనుసంధానంతో ఇంటి నుంచి డీ.ఎన్.కే వెబ్ పోర్టల్ dnk.cept.gov.in/customes.web వెబ్ పోర్టల్ ద్వారా పార్సిల్ బుక్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. తపాలా సిబ్బంది వినియోగదారుల నుంచి పార్సిల్ తీసుకుని విదేశాలకు పంపిస్తారన్నారు.

సూర్యాపేట నుంచి పోటీ చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీ చేస్తానని పార్టీ రాష్ట్ర నాయకుడు, ఎంపీటీసీల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బోళ్ల కరుణాకర్ వెల్లడించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను చైతన్యం చేసేందుకు ప్రజా ఉద్యమాల్లో, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలో ప్రతి పల్లె, పట్టణం, ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలపై సమగ్రమైన అవగాహన ఉందన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ కొందమంది చేతుల్లోనే బందీ అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనంతల రాంమూర్తి గౌడ్ , తుక్కాని మన్మథ రెడ్డి, ఎల్. రాములు, మోదాల విజయ్, పున్న వెంకటేశం, బోళ్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పెసర్లకు క్వింటాకు గరిష్టంగా రూ.9,039

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో పెసర్లకు బుధవారం మద్దతుకు మించి ధర పలికింది. మార్కెట్‌కు 379 బస్తాల పెసర్లు వచ్చాయి. క్వింటాకు గరిష్టంగా రూ.9039, కనిష్టంగా రూ.8019 ధర పలికింది. అయితే ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7755 ఉంది.

బీఎస్పీ మద్దతు ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న కడియం పరమేశ్వర్

భానుపురి (సూర్యాపేట) : డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌కు బీఎస్పీ మద్దతును ఉపసంహరించుకోవాలని తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కడియం పరమేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలమల్ల హసేన్ కోరారు. బుధవారం స్థానిక పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళిత బహుజనులపై దాడులు అత్యాచారాలు జరిగితే వెళ్లని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్.. వట్టె జానయ్యలాంటి వ్యక్తికి మద్దతుగా సూర్యాపేట పట్టణానికి రావడం రాష్ట్రంలోని దళిత బహుజనులను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. భూకబ్జాదారుడిని వెనకేసుకొస్తూ బీఎస్పీ టికెట్ ఇచ్చి గెలిపిస్తామనడం ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు రాజకీయంగా అవగాహన లేకపోవడమే అని అర్థమవుతోందన్నార. నల్లా సూర్యప్రకాష్, శంకర్ గౌడ్ ,కొల్లూరి చిరంజీవిల కుటుంబాలను ప్రవీణ్‌కుమార్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పలపల్లి చిరంజీవి, గౌడ సంఘం నాయకులు మేకపోతుల రాంబాబుగౌడ్, దళిత విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిప్పలపల్లి జయశంకర్, సభ్యులు గాజుల నరసయ్య, చెరుకుపల్లి శ్రీనివాస్, సందీప్, పూర్ణయ్య, కృష్ణ, మంగయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

పెరుగుతున్న అసంతృప్తులు

అసమ్మతి గూటికి కోదాడ మార్కెట్ తాజా మాజీ చైర్‌పర్సన్

- ఎమ్మెల్యే తమను పట్టించుకోవడం లేదని ఆరోపణ
- తన కుమారుడు అసెంబ్లీ టికెట్ రేస్‌లో ఉన్నాడని ప్రకటన
- 10న భారీ సమావేశానికి ఏర్పాట్లు



కోదాడ: కోదాడ బీఆర్‌ఎస్‌లో అసమ్మతి నేతల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉన్న నేతలు అసమ్మతి శిబిరంలో చేరడం ఆ పార్టీ శ్రేణులకు ఆందోళన కలిగిస్తోంది. ఈ అసమ్మతి జాబితాలో కోదాడ మార్కెట్ తాజా మాజీ చైర్‌పర్సన్ బుర్రా సుధారాణిపుల్లారెడ్డి చేరిపోయారు. తన కుమారుడు ప్రమోద్‌రెడ్డి కూడా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టికెట్ రేస్‌లో ఉన్నాడని ఆమె ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ అసమ్మతి నేతలందరినీ ఒక్క తాటిపైకి తీసుకురావడానికి ఈ నెల 10వ తేదీన అనంతగిరి మండలంలోని తన స్వగ్రామంలో కార్యక్రమం ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నారు.

చిచ్చు పెట్టిన బ్యాగుల పంపిణీ..

మార్కెట్ తాజా మాజీ చైర్‌పర్సన్ బుర్రా సుధారాణి పుల్లారెడ్డి తన మామగారైన బుర్ర వెంగళరెడ్డి (బీవీఆర్) ఫౌండేషన్ పేరుతో రెండు నెలలుగా కోదాడ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలిరోజు ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొల్లం ప్రారంభించినా ఆ తరువాత వారే స్వయంగా నిర్వహించడం, తన కుమారుడుకి రాజధానిలో ఉన్న పరిచయాలతో అతను కూడా బీఆర్‌ఎస్ తరుపున కోదాడ ఎమ్మెల్యే రేస్‌లో ఉన్నాడని అక్కడక్కడ చెప్పడంతో ఎమ్మెల్యేకు మార్కెట్ మాజీ చైర్‌పర్సన్‌కు మధ్య దూరం పెరిగినట్లు సమాచారం. దీన్ని మనస్సులో పెట్టుకొని ఎమ్మెల్యే తనను కావాలనే కొద్ది రోజులుగా బీఆర్‌ఎస్ తరపున నిర్వహిస్తున్న కార్యక్రమాలకు పిలవడం లేదని కినుక వహించిన మార్కెట్ మాజీ చైర్‌పర్సన్ అసమ్మతి శిబిరంలో చేరినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌లో ఓడి.. బీఆర్‌ఎస్‌లో పదవి...

కోదాడ మార్కెట్ తాజా మాజీ చైర్‌పర్సన్ బుర్రా సుధారాణిపుల్లారెడ్డి 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనంతగిరి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున జెడ్పీటీసీగా పోటీ చేశారు. ఆమెను నాడు పార్టీ జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా కూడా ప్రకటించారు. కానీ ఆమె బీఆర్‌ఎస్ అభ్యర్థి కొణతం ఉమ చేతిలో అనూహ్యంగా 4 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. తరువాత జరిగిన పరిణామాల్లో ఆమె బీఆర్‌ఎస్‌లో చేరడం, వెంటనే ఆమెకు మార్కెట్ చైర్మన్ పదవి దక్కడం నాడు చర్చనీయాంశమైంది. ప్రస్తుతం అనంతగిరి మండలం నుంచి గెలిచిన, ఓడిన జెడ్పీటీసీలు ఇద్దరు అసమ్మతి శిబిరంలోనే ఉన్నారు.

పార్టీలో అవమానాలు జరుగుతున్నాయి

పార్టీ కోసం ఇంతకాలం నమ్మకంగా పని చేశాం. ఎంతో ఖర్చుపెట్టి పార్టీ అభివృద్ధికి కృషి చేసినా ఎమ్మెల్యే పట్టించుకోకుండా, పార్టీ కార్యక్రమాలకు పిలువకుండా అవమానిస్తున్నారు. మా అబ్బాయి ప్రమోదరెడ్డి కూడా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టికెట్ రేస్‌లో ఉన్నాడు. ఎమ్మెల్యేను వ్యతిరేకిస్తున్నవారి మద్దతు కూడ గట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాం.

–బుర్రా సుధారాణిపుల్లారెడ్డి, కోదాడ మార్కెట్ మాజీ చైర్‌పర్సన్

నలుగురు మార్కెట్ మాజీ చైర్మన్లు అసమ్మతి శిబిరంలోనే...

కోదాడ వ్యవసాయ మార్కెట్‌కు చైర్మన్‌లుగా వ్యవహరించిన నలుగురు మాజీలు ప్రస్తుతం అసమ్మతి శిబిరంలో ఉండడం గమనించదగ్గ విషయం. బీఆర్‌ఎస్ అసమ్మతినేతగా ఉన్న మాజీ ఇన్‌చార్జ్ కోదాడ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా పని చేశారు. ఆయనతో పాటు ఉన్న బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి మార్కెట్ చైర్మన్‌గా గతంలో పని చేశారు. వీరితో పాటు 2009లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన అనంతరం మార్కెట్ చైర్మన్‌గా పని చేసిన మహబూబ్‌జానీ కూడా ప్రస్తుతం అసమ్మతి శిబిరంలో ఉన్నారు. తాజా మాజీ చైర్‌పర్సన్ బుర్రాసుధారాణి పుల్లారెడ్డి కూడా అసమ్మతి శిబిరంలో చేరడంతో ఈ సంఖ్య నాలుగుకు చేరింది.

ఐదు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల



మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకు పోతున్న వరదనీరు

కేతేపల్లి : నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు బుధవారం ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఐదు క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు మూసీ పరిసరాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టుకు ఎగువ నుంచి 10,145 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు మంగళవారం ఐదు క్రస్ట్ గేట్లను రెండు అడుగులు పైకెత్తి ఉంచి 9,729 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టుకు 336 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.12 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

ఎన్నికల్లో ప్రలోభాలను అరికట్టాలి

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రానున్న అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. ఎన్నికల్లో మద్యం, నగదు, విలువైన వస్తువుల పంపిణీని నిరోధించేందుకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయిలో ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశాన్ని బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా నగదు లావాదేవీలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. అసాధారణ బ్యాంకు లావాదేవీలపై నిఘా ఉంచాలనన్నారు. బ్యాంకుల్లో పది లక్షలకు పైన జరిగిన లావాదేవీలను ఐటీ శాఖకు రోజూ అందజేయాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న నగదును పసిగట్టేందుకు నిఘా పెటాలని, బస్టాండు, రైల్వేస్టేషన్లు, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్పీ బి. రాజేంద్ర ప్రసాద్, అదనపు కలెక్టర్ ఎ. వెంకటరెడ్డి, డీఎస్పీలు రవి, ప్రకాష్, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి ప్రకాష్‌శర్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజల సౌలభ్యం కోసమే ఒకే సముదాయంలో కార్యాలయాలు

ప్రజల సౌలభ్యం కోసమే ఒకే సముదాయంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎస్. వెంకట్రావు తెలిపారు. నూతన కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన ,ఎంప్లాయ్‌మెంట్, ఇండస్ట్రియల్, జిల్లా ఆడిట్ , సర్వే ల్యాండ్స్ కార్యాలయాలను బుధవారం ప్రారంభించారు. శాఖల వారీగా జిల్లా అధికారులను వారివారి సీటులో కూర్చోబెట్టి కలెక్టర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డి, డీఎఫ్‌ఓ సతీష్ కుమార్, వ్యవసాయ అధికారి రామారావు నాయక్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్, సీపీఓ వెంకటేశ్వర్లు, ఉపాధి కల్పన అధికారి మాధవరెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి తిరుపతయ్య, జిల్లా ఆడిట్ అధికారి సంతోష్‌రావు పాల్గొన్నారు

స్థానిక సంస్థల బలోపేతానికి కృషి



జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజ్ నియామకపత్రాలు అందజేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేటలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ వెంకట్రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ సమ్మేళనంలో 180మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజ్ నియామక పత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్ రావు, ఎంపీ లింగయ్య యాదవ్‌తో కలిసి అందజేసి అభినందించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ స్థాయిలో 20అవార్డులకు గాను 19 అవార్డులు ఒక్క తెలంగాణకే అందాయని, స్థానిక సంస్థల పనితీరు దీనికి నిదర్శమన్నారు. నియామక పత్రాలు పొందిన ప్రతి ఒక్కరూ అంకుంఠిత దీక్షతో మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. తెలంగాణ సాధించుకున్నాక జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించేందుకు దేశ, అంతర్జాతీయ స్థాయిలో బృందాలు తెలంగాణను సందర్శించి ప్రగతిని పరిశీలిన చేస్తున్నారని తెలిపారు. నీటి నిలువలు పెంచి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి కోటి 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అందిస్తున్నామన్నారు. తెలంగాణలో ప్రత్యక్షంగా 30లక్షల ఉద్యోగాలు, పరోక్షంగా 50లక్షల ఉద్యోగాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, అదనపు కలెక్టర్ ప్రియాంక, జెడ్పీ సీఈఓ సురేష్, డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీపీఓ యాదయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో ఆలయాలకు పూర్వవైభవం

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట) : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ఆలయాలకు పూర్వవైభవం వచ్చిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆత్మకూర్ మండలంలో రూ. కోటి వ్యయంతో నిర్మించిన నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయంలో ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఆయన హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకుల హయాంలో శిథిలావస్థకు చేరిన ఆలయాలు స్వరాష్ట్రంలోనే అభివృద్ధి చెందాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితో ఆలయాల నిర్మాణంతో పాటు ధూప దీప నైవేద్యాలతో అర్చకులకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. ఆలయంలో గణపతి హోమం నిర్వహించిన మంత్రి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ మర్ల స్వర్ణలత, సింగిల్‌విండో చైర్మన్ సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షులు తూడి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్, చైర్మన్ బెల్లం కొండ యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దండుమైసమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి జగదీష్‌రెడ్డి

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వయంభూలకు బిందెతీర్థం, ఆరాధన గావించారు. శ్రీస్వామి వారికి బాలభోగం చేపట్టిన తరువాత మూలవర్యులకు నిజాభిషేకం నిర్వహించి, అలంకరించారు. శ్రీస్వామివారికి విశేషంగా సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు శ్రీస్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఇక ఆలయంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలను నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌కు యాదవులను దూరం చేసే కుట్ర

సూర్యాపేట: 'ఉమ్మడి జిల్లాలో యాదవులకు రాజకీయంగా ద్రోహం చేసిన పార్టీ కాంగ్రెస్.. యాదవులను బీఆర్‌ఎస్‌కు దూరం చేయాలని కుట్ర చేస్తోంది' అని అఖిల భారత యాదవ మహాసభ నేతలు ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో మరోసారి సిట్టింగ్ యాదవ శాసనసభ్యులకు బీఆర్‌ఎస్ టికెట్లు ఇచ్చినందుకు కృతజ్ఞతగా సూర్యాపేటలో మంత్రి జగదీష్‌రెడ్డిని అఖిల భారత యాదవ మహాసభ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో యాదవులకు రెండు అసెంబ్లీ సీట్లు కేటాయించినందుకు కృతజ్ఞతగా వచ్చే ఎన్నికల్లో 12 అసెంబ్లీ సీట్లు గెలిపించి బహుమతిగా ఇస్తామని తెలిపారు. 2018 ఎన్నికల్లో ఐదు అసెంబ్లీ సీట్లు, రాజ్యసభ సీటు, ఎమ్మెల్సీ ఇవ్వడమే బీఆర్‌ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌కు యాదవుల పట్ల ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి ప్రోత్సాహం వల్ల ఉమ్మడి జిల్లాలో రెండు అసెంబ్లీ సీట్లు, ఒక రాజ్యసభ, కార్పొరేషన్ చైర్మన్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో అర్వపల్లి జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఏడుకొండలు యాదవ్, రాష్ట్ర నేతలు సుధాకర్ యాదవ్, బాలరాజు యాదవ్, రాజారాం యాదవ్ పాల్గొన్నారు.



మంత్రి జగదీష్‌రెడ్డికి గొర్రె పిల్లను అందజేస్తున్న యాదవ మహాసభ నాయకులు

సాగర్ ఆయకట్టులో ఆరుతడి మేలు

- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పి.రఘురామిరెడ్డి సూచనలు

నల్లగొండ : కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టుకు నీటిని విడుదల చేయలేదు. ఏటా వరి సాగు చేసే భూముల్లో రైతాంగం ఇప్పటి వరకు ఏ పంటలూ విత్తుకోలేదు. ఈ నేపథ్యంలో సాగర్ ఆయకట్టు పరిధిలో సాగు చేయదగ్గ పంటల గురించి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి పలు సూచనలు చేశారు.

నీటి వసతి, నేలరకం ఆధారంగా..

- వర్షాలపై ఆధారపడిన వారు తమ భూముల్లో ఉలవలు, బొబ్బెరలు (అలసందలు), నీటి వసతి ఉన్నవారు పెసర, మినుము, కంది, వేరుశనగ, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న, జొన్న, ఆముదం పంటలు సాగు చేసుకోవచ్చు.
- వరి సాగుచేసే భూముల్లో మొక్కజొన్న, కంది, పొద్దు తిరుగుడు, ఆముదం ఇతర పంటలు సాగు చేసినప్పుడు అధిక వర్షాలు కురిసినప్పుడు భూముల్లో నీరు నిలుస్తుంది. దీని వల్ల మొక్కలు వేరు కుళ్లు తెగులు సోకి నష్టపోకుండా బోదెలు, సాళ్ల పద్ధతిలో విత్తుకోవడం శ్రేయస్కరం



సాగర్ ఆయకట్టులో బీడుగా ఉన్న భూమి

పంటల్లో యాజమాన్య పద్ధతులు

- మొక్కజొన్నకు 6 నుంచి 8 తడులు ఇవ్వాలి. మొదటి నెల రోజుల వరకు నీరు నిల్వ ఉండకూడదు. జల్లు, పూత, గింజ పాలు పోసుకునే దశలో తప్పనిసరిగా నీటి తడులు ఇవ్వాలి.
- జొన్న పంటకు 4 నుంచి 6 తడులు ఇవ్వాలి. పంట విత్తిన నెల రోజుల వరకు మొవ్వు తొలుచు ఈగ నుంచి పంటను కాపాడుకోవాలి.
- కంది పంటకు 5 నుంచి 7 తడులు ఇవ్వాలి. ఎండు తెగులు తట్టుకునే మధ్యకాలిక రకాలను సాగు చేసుకోవాలి. దుక్కిలో ఎకరానికి ఒక బస్తా డీఏపీ తప్పనిసరిగా వేసుకోవాలి. మొగ్గ రాబోయే ముందు, కాయలు ఏర్పడే దశలో తప్పకుండా నీటి తడి ఇవ్వాలి. మొగ్గ దశ, కాయలు ఏర్పడే దశల్లో నీరు ఎక్కువైనా లేదా బెట్టకు గురైనా పూత కాత రాలిపోతుంది.
- పెసర, మినుము పంటకు 4 నుంచి 6 తడులు ఇవ్వాలి. పూత, కాయ తయారయ్యే దశలో పంట బెట్టకు గురికాకుండా చూడాలి.
- వేరుశనగ పంటకు 6 నుంచి 7 తడులు ఇవ్వాలి. రెండవ తడిని విత్తిన తర్వాత మొలక వచ్చిన 20 నుంచి 25 రోజులకు (పూర్తిగా ఒకేసారి పూత వచ్చేందుకు) ఇవ్వాలి. పైరులో ఊడలు దిగే దశ నుంచి కాయలు ఊరే వరకు (విత్తిన 45 – 50 రోజులు నుంచి 85 – 90 రోజుల వరకు) నీరు సక్రమంగా తగు మోతాదులో కట్టాల్సిన అవసరం ఉంది.
- పొద్దు తిరుగుడు పంటకు 4 నుంచి 6 తడులు ఇవ్వాలి. నేల రకాన్ని బట్టి పగటి ఉష్ణోగ్రతను బట్టి ఎర్ర నేలల్లో 8 నుంచి 10 రోజుల వ్యవధిలో, నల్లరేగడి నేలల్లో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో నీటి తడులు పెట్టాలి. మొగ్గ తొడుగు దశ, పువ్వు వికసించు దశ, గింజ కట్టే సమయం దీనిలో కీలక దశలు. పైరు పూత దశలో ఆకర్షక పత్రాలు వికసించే దశలో రెండు గ్రాముల బోరాక్స్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఆముదం పంటకు 8నుంచి 10 తడులు ఇవ్వాలి. అక్టోబర్, డిసెంబర్ వరకు తక్కువ ఉష్ణోగ్రత వల్ల 12 నుంచి 15 రోజులకు ఒకసారి నీటి తడి ఇవ్వాలి. జనవరి నెల నుంచి ఎనిమిది నుంచి పది రోజుల వ్యవధిలో నీరు ఇవ్వాలి. పూత, కాయ ఊరే దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి.

మూడు రోజులుగా మోస్తరు వర్షాలు

- లోతట్టు ప్రాంతాల్లో చేరిన నీరు
- పంటలకు మేలు

సూర్యాపేట : తుపాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మూడు రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధానంగా ఆగస్టు మాసం తీవ్ర వర్షాభావం పరిస్థితులు నెలకొనగా.. సెప్టెంబర్ మొదట్లోనే కురిసిన వర్షాలతో రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ వర్షాలు పంటలకు జీవం పోసినట్లయింది. ఈనెల 4వ తేదీన దాదాపు 18 మండలాల్లో మోస్తరు వర్షాలు ప్రారంభం కాగా.. సగటున 8.7మి.మీ వర్షపాతం, ఈనెల 5వ తేదీన జిల్లా అంతటా కురవగా సరాసరి 28.1 మి.మీటర్లు, ఈనెల 6వ తేదీన బుధవారం ఉదయం 8.30గంటల నుంచి రాత్రి 6గంటల వరకు సుమారుగా 19 మండలాల్లో మోస్తరు నుంచి చిరుజల్లులు పడ్డాయి.



ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిలిచిన నీరు

సరాసరి 5.2 మి.మీ.

తుపాన్ కారణంగా సూర్యాపేట జిల్లాలోని చాలా మండలాల్లో వరసగా మూడోరోజు వర్షం కురిసింది. సరాసరి 5.2 మి.మీటర్ల వర్షం పడగా అత్యధికంగా ఆత్మకూర్ (ఎస్)లో 19.5 మి.మీ, హుజూర్‌నగర్‌లో 14.8, అనంతగిరిలో 12.1, నడిగూడెంలో 10.0, మఠంపల్లిలో 8.3, చిలుకూరులో 8.0, చింతలపాలెంలో 7.3, మేళ్లచెర్వులో 7.0, కోదాడలో 6.3, మునగాలలో 5.8, గరిడేపల్లిలో 5.8, చివ్వెంలలో 3.2 చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ మోస్తరు వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పత్తిచేలల్లోనూ అక్కడక్కడా వర్షపు నీరు నిలుస్తోంది. వాగులు, వంకలు ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని వరి పొలాలు ప్రస్తుతం నీటమునగగా.. ఎలాంటి నష్టం వాటిల్లలేదు. కాగా జిల్లాకు మరో రెండురోజుల పాటు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



మిరప చేనులో నిలిచిన వర్షపు నీరు

క్లుప్తంగా

ఒకేరోజు భార్యాభర్త మృతి



లక్ష్మీనర్సయ్య, సరోజనమ్మ (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): మండలంలోని తొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కలఏల లక్ష్మీనర్సయ్య (80), ఆయన భార్య సరోజనమ్మ (73) మంగళవారం రాత్రి మృతిచెందారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సరోజనమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. భార్య చనిపోయిన దుఃఖంలో రోదిస్తూ రెండు గంటల తర్వాత లక్ష్మీనర్సయ్య గుండెపోటుతో మృతిచెందాడు. భార్యాభర్తలు ఒకేరోజు చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

వీఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ కంపెనీ సీజ్



అధికారులు సీజ్ చేసిన వీఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ కంపెనీ ఇదే..

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల శివారులో లైసెన్స్ లేకుండా పాల ఉత్పత్తులు తయారు చేసి విక్రయిస్తున్న వీఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ పరిశ్రమను బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుపాముల శివారులో ఆరు నెలల క్రితం ఏర్పాటు చేసిన వీఎన్ఆర్ డెయిరీ ప్రొడక్ట్స్ కంపెనీని ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర కమిషనర్, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం కొమరబండ వద్ద గతంలో నిర్వహించిన డెయిరీ పరిశ్రమ పేరిట పొందిన లైసెన్స్‌తోనే ఈ కంపెనీ నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా పాల ఉత్పత్తులు తయారు చేసే పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో కంపెనీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తుండటంతో పాటు డెయిరీ ఉత్పత్తుల్లో నాణ్యత పట్ల అధికారులు అనుమానం వ్యక్తం చేస్తూ కంపెనీలో నిల్వ ఉన్న రూ.6లక్షల విలువైన 2000 పాల ప్యాకెట్లు, ప్రొటీన్ బైండర్స్‌ను సీజ్ చేశారు. నాణ్యత నిర్ధారణ కోసం పాలు, పెరుగు ఉత్పత్తుల నమూనాలను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. డెయిరీ ఉత్పత్తుల్లో కల్తీ జరిగినట్లు నివేదిక వస్తే కంపెనీని పూర్తిగా సీజ్ చేస్తామని అధికారులు పేర్కొన్నారు. కంపెనీ నిర్వహణకు సంబంధించి పదిహేను రోజుల్లో అన్నిరకాల అనుమతులు పొందాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి స్వాతి, కేతేపల్లి తహసీల్దార్ ఎస్. మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గోపిక, కృష్ణులు

'సాక్షి' ఆహ్వానానికి విశేష స్పందన వచ్చింది. కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులను కృష్ణులుగా, గోపికలుగా అలంకరించి ఫొటోలను పంపించాలని కోరగా.. ఆ మేరకు తల్లిదండ్రులు తమ బుజ్జాయిలను అందంగా ముస్తాబు చేసి ఫొటోలను వాట్సప్ చేశారు. చిన్నారులు అందమైన వేషధారణతో ఆకట్టుకున్నారు.



కార్తీకలక్ష్మి, బొడ్రాయి బజార్, కోదాడ పట్టణం
జి. దుర్గచరణ్, సూర్యాపేట
రిత్విక, తిరుమలగిరి
వెర్నిక, తిరుమలగిరి
రిషిక, తిరుమలగిరి
పున్న సన్విత్ నిహాల్, జాజిరెడ్డిగూడెం
పి. జయరామ్, గుడిబండ గ్రామం, కోదాడ మండలం
చైత్రిక్ గౌడ్, సూర్యాపేట
సహర్ష, జేజే నగర్, సూర్యాపేట
మేకల అభిరామ్, సాయిసుశాంత్, అన్నపూర్ణగోపయ్యనగర్, కోదాడ
జటంగి. సాక్షిత్ యాదవ్, రాఘవాపురం, మోతె
కోమరెడ్డి విషిత, అద్విర్, కోదాడ మండలం
అన్విత్ సాయి, సూర్యాపేట
తంగెళ్ల మహాన్ష్ రెడ్డి, నేమ్మికల్, ఆత్మకూర్ (ఎస్) మండలం
జటోతు వీక్షిత్ రామ్, రామ్‌కోటితండా, చివ్వెంల మండలం
మాదంశెట్టి ఆద్విక ఫృథ్వీ, కుడకుడ, సూర్యాపేట మండలం
అర్జున్ శ్రీ హాన్, సూర్యాపేట
ఇందుర్తి చరిత్‌రెడ్డి, తిమ్మాపురం, జాజిరెడ్డిగూడెం మండలం
జి. అక్షయరెడ్డి, సూర్యాపేట
దరావత్ తనుశ్రీ, పచ్చా నాయక్ తండా, చివ్వెంల మండలం
కె. కార్తికేయ, శ్రీ సిరి, హుజూర్‌నగర్
మన్నె విహాన్ యాదవ్, శ్రీరామ్‌నగర్, సూర్యాపేట
బత్తుల వేదాన్షి, జేజేనగర్, సూర్యాపేట
మను, తిరుమలగిరి
ఎం. మిథున్, శరణ్య, బాలాజీనగర్, సూర్యాపేట
కె. సాత్విక, సూర్యాపేట
సింగం యువాన్ యాదవ్, హుజూర్‌నగర్
జి. అనిరుధ్, తిరుమలహిల్స్, తిరుమలగిరి
పుట్టల సహస్ర, సాయి నిక్షిత్, సూర్యాపేట
గౌతం శ్రీనివాస్, గోవిందపురం, హుజూర్‌నగర్ మండలం
పగడాల మన్విత్, పాలకవీడు, సూర్యాపేట
జి. ఆర్వీ రెడ్డి, సూర్యాపేట
ఆవుల మనస్విత, అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం మండలం
స్వీటీకుమారి, పార్వాయిపల్లి, జాజిరెడ్డిగూడెం మండలం
పి. ప్రణయ దీప్తి, 20వ వార్డు, సూర్యాపేట
యువన్, రేయన్షిక, కోదాడ
బొడ్డు అక్షిత, శ్రీమన్‌తేజ్, తిమ్మాపురం, జాజిరెడ్డిగూడెం మండలం
కొంతం మోక్షారెడ్డి, సూర్యాపేట
శ్రీరామ్ తేజ్, ముత్యాలమ్మ టెంపుల్ వీధి, సూర్యాపేట
రెమిదాల ధాత్రి, బేతవోలు, చిలుకూరు (మం)
జిల్లేపల్లి దేవాన్ష్, కోదాడ
దీపాన్షరెడ్డి, వేపలసింగారం, హుజూర్‌నగర్
దక్షిత్ రెడ్డి, కస్తూరి బజార్, సూర్యాపేట
రిక్కి, కస్తూరి బజార్ సూర్యాపేట
లక్షీలాస్య, కీర్తి, కావ్య, గుంజలూరు, చివ్వెంల
కదిర మనీత్‌రెడ్డి, వేపలసింగారం, హుజూర్‌నగర్
కందుకూరి హర్షిత, సారిక, ఉషశ్రీ, తిమ్మాపురం
ఇందుర్తి అఖిల్ రెడ్డి, తిమ్మాపురం, జాజిరెడ్డి గూడెం మండలం
పంగ ఆరాధ్య శ్రీరాజ్, దిర్శించర్ల, నేరేడుచర్ల
యశ్విత్, రేపూరు, మేళ్లచెరువు మండలం
వర్రె గోపికిషోర్, రామన్నగూడెం, జాజిరెడ్డిగూడెం మండలం
నక్షత్ర, అక్షయ, తాళ్లగడ్డ, సూర్యాపేట
కొండ్రు యువన్‌తేజ్, సూర్యాపేట
సొల్లేటి హరేంద్రాచారి, బాలెంల, సూర్యాపేట మండలం
సిద్దార్థ, గడ్డిపల్లి, గరిడేపల్లి
చిన్ను, సూర్యాపేట

బైక్‌ను ఢీకొట్టిన లారీ..
ప్రధానోపాధ్యాయురాలు మృతి

- కృష్ణాష్టమి ఐచ్ఛిక సెలవు రద్దు కావడంతో హడావిడిగా పాఠశాలకు వెళ్తుండగా ఘటన



కవిత (ఫైల్)

సూర్యాపేట క్రైం: బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ఘటనలో ప్రధానోపాధ్యాయురాలు మృతిచెందింది. ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని అమ్మ గార్డెన్స్ వద్ద గల పెట్రోల్ బంక్ సమీపంలో జలగం కవిత(41), లింగయ్య దంపతులు నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కవిత పెన్‌పహాడ్ మండలంలోని సింగారెడ్డిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా.. లింగయ్య అదే మండలంలోని అనాజిపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కృష్ణాష్టమి సందర్భంగా బుధవారం ప్రకటించిన ఐచ్ఛిక సెలవును రద్దు చేసి గురువారానికి మార్చినట్లు తెలియజేయడంతో ఉదయం భార్యాభర్తలిద్దరూ కలిసి హడావిడిగా బైక్‌పై పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో సూర్యాపేట పట్టణంలోని కొత్త వ్యవసాయం మార్కెట్ సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కవిత అక్కడికక్కడే మృతిచెందగా, లింగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. లింగయ్య చికిత్స నిమిత్తం స్థానికులు సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. జనరల్ ఆస్పత్రిలోనే కవిత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. కాగా కృష్ణాష్టమి ఐచ్ఛిక సెలవును గురువారానికి మార్చినట్లు బుధవారం ఉదయం తెలియజేయడంతో కవిత, లింగయ్య అప్పటికప్పుడు పాఠశాలలకు వెళ్తుండగా ఈ ఘటన జరిగినట్లు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కవిత చిన్న కుమార్తె శ్రేష్ఠ సూర్యాపేటలోనే 8వ తరగతి చదువుతుండగా.. పెద్ద కుమార్తె కీర్తి హైదరాబాద్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతుంది. తల్లి మృతితో ఇద్దరు చిన్నారులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఒక నిండు ప్రాణం బలైందని టీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం కృష్ణాష్టమి ఐచ్ఛిక సెలవు రద్దు చేస్తూ ఉదయం 8 గంటల తర్వాత ప్రకటించడంతో ప్రధానోపాధ్యాయురాలు కవిత ఆగమేఘాల మీద పాఠశాలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిందని, ఆమె భర్త లింగయ్య తీవ్ర గాయాలపాలయ్యారని అన్నారు. విద్యాశాఖ అధికారులు బాధ్యత వహించి కవిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

విద్యార్థినుల మృతితో రెండు గ్రామాల్లో విషాదం



నక్కలపల్లిలో మనీషా మృతదేహానికి నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నల్లగొండలోని రాజీవ్‌పార్కులో మంగళవారం గడ్డిమందు తాగి పడిపోయిన మనీషా, శివాని

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లికి చెందిన దొంతరబోయిన శివాని(18), అమ్మనబోలుకు చెందిన అనుగూతల మనీషా(18) నల్లగొండలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆ రెండు గ్రామాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. శివాని, మనీషా ఇద్దరూ నార్కట్‌పల్లిలో ఇంటర్(బైపీసీ) ఒకే కళాశాలలో చదివారు. అప్పుడే వారి మధ్య స్నేహం ఏర్పడింది. ఇంటర్ పూర్తయిన అనంతరం నల్లగొండలోని ప్రభుత్వ ఉమెన్స్ కాలేజీలో బీఎస్సీలో చేరారు. నల్లగొండలోనే ఎస్సీ ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. నక్కలపల్లి గ్రామానికి చెందిన దొంతరబోయిన సైదులుకు ఒక కూతురు శివాని, ఒక కుమారుడు ఉన్నారు. తండ్రి గ్రామంలో వ్యవసాయకూలి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. శివాని గ్రామంలోని హైస్కూల్‌లో 10వ తరగతి వరకు చదివి ఇంటర్ నార్కట్‌పల్లిలో చదివింది. ఇదే మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన ఎనుగుత్తల మల్లయ్యకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు కాగా.. మనీష రెండో కూతురు. ఆమె 10వ తరగతి వరకు గ్రామంలోని హైస్కూల్‌లో, ఇంటర్ నార్కట్‌పల్లిలో చదివింది. తండ్రి రోజువారి కూలి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 'నా బిడ్డను ఎవరో బెదిరించి సెల్ ఫోన్‌లో ఫొటోలు పెట్టారంట, అందుకే నా బిడ్డ గడ్డిమందు తాగి చనిపోయింది. నా బిడ్డను బెదిరించిన వాళ్లను పట్టుకోవాలి' అని శివాని తల్లి రేణుక వేడుకుంది. 'మా కూతురు కాలేజీకి పోతున్నా అని పొద్దున్నే వెళ్లిపోయింది. నల్లగొండలో గడ్డిమందు తాగి చనిపోయింది. ఫోన్ చేసి నాకు ఏమో అవుతుందని చెప్పింది. అంతే తప్ప ఏమైందో తెలియదు' అని మనీష తల్లిదండ్రులు మల్లయ్య, యాదమ్మ చెప్పారు.

గ్రామాలకు చేరిన మృతదేహాలు

శివాని, మనీషా మృతదేహాలకు బుధవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తరువాత మధ్యాహ్నం వారి గ్రామాలకు తరలించారు. మృతదేహాలను చూడగానే కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామస్తులు కూడా కన్నీటిపర్యంతమయ్యారు. నక్కలపల్లిలో జరిగిన శివాని అంతిమ యాత్రలో ప్రజలంతా పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు అంత్యక్రియలు ముగిశాయి. కాగా, మనీషా బాబాయ్ ముంబాయిలో ఉంటున్నందున ఆయన రాగానే మనీషా అంత్యక్రియలు అమ్మనబోలులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే పరామర్శ

మృతుల కుటుంబ సభ్యులను ఆయా గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వీరి వెంట ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఈద మాదవి నర్సింహ్మా, బద్దం వరలక్ష్మి రాంరెడ్డి, ఎంపీటీసీలు కొంపెల్లి సైదులు, అంజయ్య, బాషపాక రవికుమార్ తదితరులు ఉన్నారు.



నార్కట్‌పల్లి: అమ్మనబోలులో మనీషా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు

హైవేపై ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టిన లారీ

- లారీ డ్రైవర్ దుర్మరణం

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ శివారులో బుధవారం తెల్లవారుజామున విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. చిట్యాల ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం(టీఎస్ 05 యూఏ 3446)ను చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ శివారులోకి రాగానే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై డ్రైవర్ నిలిపాడు. అదే దారిలో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ(ఎంహెచ్ 13 సీయూ 1839) ఆగి ఉన్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ హాజీమలాంగ్ నబిలాల్(43) అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మృతదేహాన్ని స్థానికుల సహాయంతో బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా డీసీఎంను డ్రైవర్ జాతీయ రహదారిపై పార్కింగ్ చేయడంతో ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.